అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్ నాయక్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో అంకితభావంతో పని చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధ్యక్షతన జిల్లా స్థాయి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన పేద, బడుగు బలహీనవర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలో మానుకోట జిల్లా ప్రాంతం భాగస్వామ్యం ఉన్నందున గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రాజెక్టు డైరెక్టర్ పూర్తి సహకారం అందించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో అంతర్గత అభివృద్ధి పనులు చేయించి, పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీరు సరఫరా రోడ్ల నిర్మాణం తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. కేసముద్రం మండలం తిమ్మపేటలో 30 మంది గిరిజనుల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని, జిల్లాలో నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. దంతాలపల్లి గ్రామంలో డంపింగ్‌యార్డ్ సమస్యను అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లికుదురు మండలంలో వరదలు, భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలు తెగిపోయి వాటి నిర్మాణ ప్రాతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అధికారులు మారినా ప్రభుత్వ పరంగా శాఖల పరంగా జరిగే పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీర బ్రహ్మచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి తాళం

తాళం వేసి ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం

గూడూరు, ఏప్రిల్ 4 : ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి నిత్యం తాళం వేసి ఉండడంతో తమకు పనులు కావడం లేదని బీఆర్ఎస్ నాయకుడు, టీబీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా సురేశ్‌నాయక్, రహీం ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగడి ప్రాంతంలోని ఆర్‌అండ్‌బీ సబ్‌డివిజన్ కార్యాలయానికి సురేశ్‌నాయక్ పని నిమిత్తం వెళ్లాడు. మధ్యాహ్నం 2గంటలకు కూడా కార్యాలయానికి తాళం వేసి ఉందని, కార్యాలయ సిబ్బందిగానీ అధికారులు గానీ రాలేదన్నారు. తాము రెండు రోజులుగా కార్యాలయానికి వస్తున్నాని, ఒక్క అధికారి కానీ, సిబ్బంది కానీ రావడం లేదన్నారు. గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాలకు సంబంధించిన ప్రజలు కార్యాలయానికి వస్తే కార్యాలయం తాళం వేసి ఉంటున్నదని, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయంలో సిబ్బందిని, అధికారులను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కేసముద్రం , ఏప్రిల్ 4 : ఆరోగ్యానికి హాని కలిగించే డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు అన్నారు. డ్రగ్స్ వలన కలిగే దుష్పరిణామాలపై శుక్రవారం కళాశాలలో అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు లెక్కల సంతోష్‌రెడ్డి, మైసయ్య, గడిచెల రాజు, అలువాల యాదగిరి, మున్ని, ఉడుత రవి, సోమ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

అకాల వర్షం..రైతులు ఆగం..

- చేతికొచ్చిన మక్కజొన్న, మిర్చి, వరిధాన్యం నీళ్లపాలు
- ఆందోళనలో అన్నదాత

బయ్యారం : సంగ్యాతండాలో కల్లాల్లో ఆరబోస్తున్న మిర్చి పంట

బయ్యారం ఏప్రిల్ 4 : అకాల వర్షం బయ్యారం మండలంలోని రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. గురువారం రాత్రి ఒక్క సారిగా ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షం గంటకు పైగా కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న పంట తడిసిముద్దయ్యాయి. యాసంగి సాగులో మండలంలో 2500 ఎకరాల్లో మిర్చి, 9965 ఎకరాల్లో మక్కజొన్న, 1620 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వర్షం కారణంగా ఏజెన్సీలోని అల్లిగూడెం, బీరోనిమడవ, బీమ్లా తండా, పందిపంపుల, కంబాలపల్లి, లక్ష్మీపురం, నర్సా తండా, చోక్లాతండా, రామచంద్రాపు రం, సుద్దరేవు, కాచనపల్లి వంటి పలు గ్రామాల్లో చేతి కొచ్చిన మక్క పంట నీళ్ల పాలైంది. గిరిజన రైతులు అత్యధి కంగా సాగు చేసిన మక్కజొన్న పంట కల్లాల్లో ఉండగా అకాల వర్షంతో తడిసి ముద్దయ్యాయి. అలాగే కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసి నష్టం వాటిల్లింది. టార్పాలిన్లు కప్పి పంట కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మండలంలోని సంగ్యాతండా గ్రామంలో పొలాల్లో వర్షపు నీరు నిలువటంతో మిర్చి, మక్క పంట నీటిలో మునిగిపోయి సుమారు ముప్పై మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంట నీళ్ల పాలు అయ్యిందని, నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. వెంకట్రాంపురం గ్రామంలో తడిసిన పంటలను ఏవో రాంజీ నాయక్ పరిశీలించారు. అకాల వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలన్నారు.

నేలవాలిన వరి పంట

నర్సింహులపేట : మండల వ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి చేతికొచ్చిన వరి పంట నెలకొరిగింది. మండలంలో అన్ని గ్రామాల్లో రాత్రి కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన మక్కజొన్న, వరిధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం సైతం గాలి వీస్తుండటంతో ఉన్న వరి నెలకొరగడంతో పాటు, మామిడికాయలు రాలిపోయే ప్రమాదం ఉందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

తడిసి ముద్దయిన పంట..

చిన్నగూడూరు : ఆరుకాలం కష్టపడి పండించిన పంటలు అకాల వర్షంతో తడిసి ముద్దయ్యాయి. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి, వడ్లు తడిసి ముద్దయ్యాయి. పలు గ్రామాల్లో గాలిదుమారం వర్షంతో వరి నేలకొరిగింది.

అకాల వర్షం-అపార నష్టం

గంగారం : ఆరుగాలం కష్టపడి చేతికి అందే సమయంలో వచ్చి వర్షానికి మండల వ్యాప్తంగా మక్కజొన్న పంటలు నేలమట్టమయ్యాయి. గురువారం అర్ధరాత్రి గాలి వాన బీభత్సంతో జంగాలపల్లి, మడగూడెం, కొడిశలమిట్ట, బావురుగొండ, ఎల్లాపురం గ్రామాల్లో మక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సర్వే చేయించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

వర్షంతో దెబ్బతిన్న పంటలు..

కొత్తగూడ : కొత్తగూడ ఏజెన్సీలో గురువారం, శుక్రవారం కురిసిన వడగళ్ల వానకు మండలంలోని పలు గ్రామాల్లో మక్కజొన్న, వరి పైర్లు పూర్తిగా నేలవాలాయి. మండలంలోని ముస్మీ, లక్ష్మీపురం, దుర్గారం, దుర్గారం తండా, పొగుళ్లపల్లి, సరసనపల్లి, ఎడుళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో తీవ్రంగా పంట నష్టం వాటిల్లింది. వరి పైర్లు గింజలు రాలిపోయాయి. ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదేవిధంగా ముస్మీ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి పైకప్పులుసైతం వడగండ్ల వానకు లేచిపోయాయి. 150 ఎకరాల్లో మక్కజొన్న, వరి పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏవో ఉదయ్ తెలిపారు. నేడు (శనివారం) నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక తయారుచేస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు.

తడిసిన మక్కలు..

కేసముద్రం : మండలంలో గురువారం రాత్రి కురిసిన వరానికి రైతులు కల్లాల్లో ఆరబోసిన మక్కజొన్న పంట తడిసింది. అక్కడక్కడ వరి చేను నేలవారింది.

అకాల వర్షంతో రైతుల ఆందోళన..

కురవి : కురవి, సీరోలు మండలాల్లో గురువారం కురిసిన అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కాంపల్లిలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం తడిసింది. టార్పాలిన్‌లపై నీళ్లు నిలిచిపోయాయి.

బయ్యారం : తడిసిన మక్కలు ఆరబోస్తున్న రైతు

బయ్యారం : కల్లాల్లో నీట మునిగిన మక్కజొన్న, వరిధాన్యం

చిన్నగూడూరు : తడిసిన మిర్చిని ఆరబెడుతున్న పేరం రవి

రాయల సుభాష్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

కొత్తగూడ, ఏప్రిల్ 4 : సీపీఐ ఎంఎల్ ప్రజాపందా రాష్ట్ర మాజీ కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు కృషి చేద్దామని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో పనిచేసి భారత విప్లవోద్యమానికి వేగుచుక్కలా రాయల బోస్ నిలిచారన్నారు. విప్లవోద్యమంలో తలెత్తిన అతివాద, మితవాద అవకాశవాదాలను ఎండగడుతూ ప్రజాయుద్ధ పందాను అభివృద్ధి చేశాడన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోకి కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచి దృష్టి మళ్లించే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈకార్యక్రమంలో డివిజన్‌నాయకులు గొంది సమ్మయ్య, మండల మద్దరిబోయిన కొమ్మాలు, గట్టి సారయ్య, కల్తి ఎర్రయ్య, ఐత శ్రీరాములు, గట్టి సాంబయ్య పాల్గొన్నారు.

భోజనాలు చేస్తున్న తండా ప్రజలు

ఆంబోతుకు అంత్యక్రియలు

తండాలో సహపంక్తి భోజనాలు

నర్సింహులపేట, ఏప్రిల్ 4 : మండలంలోని రూప్లాతండా జీపీ పరిధి బీల్యాతండాలో ఆంబోతు వృద్ధాప్యంతో చనిపోవడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించిన విషయం తెలిసిందే. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కస్నానాయక్ 22ఏళ్ల క్రితం తన తండ్రి బీల్యానాయక్ పేర కోడె (దేవుడి కోడె)ను ఊరు కోసం ఇచ్చాడు. అది గురువారం వృద్ధాప్యంతో చనిపోయింది. తండావాసులు నీళ్లు ఆరగిస్తూ డీజేతో ఊరేగించారు. అనంతరం ఖననం చేశారు. శుక్రవారం దేవుని కోడె మృతి చెందిన సందర్భంగా గిరిజన సాంప్రదాయం ప్రకారం బోగ్ బండారు(నెయ్యితో ప్రత్యేకంగా తయారు చేసిన వంటకం)కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదానం చేశారు. తండావాసులంతా పనులకు వెళ్లకుండా కార్యక్రమంలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

కాలం చెల్లిన చిప్స్ ప్యాకెట్లు..

పిల్లల ప్రాణాలతో చెలగాటం

నర్సింహులపేట, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలో కొన్ని కిరాణ దుకాణాల్లో కాలం చెల్లిన చిప్స్ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్ అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. చిన్న పిల్లలు మారాం చేస్తే రూ.5, రూ.10తో వారికి పెద్దలు చిప్స్ ప్యాకెట్లు కొనిస్తుంటారు. ఇంత వరకు బాగానే ఉన్నా గడువు ముగిసిన చిప్స్ ప్యాకెట్లు దుకాణాల్లో అమ్ముతుండటం, విషయం తెలియని పిల్లలు వాటిని తినడం వలన వాంతులు, విరేచనాలు వంటి అనార్యోగ సమస్యలు తలెత్తుతున్నాయని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి పిల్లల ఆరోగ్యాలు కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్య బాధితుడికి రెడ్యా పరామర్శ

చిన్నగూడూరు, ఏప్రిల్ 4 : మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ముత్యం వెంకన్న తండ్రి భిక్షం అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఉగ్గంపల్లిలో ఉంటున్న భిక్షంను శుక్రవారం పరామర్శించారు. రెడ్యా వెంట జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు మహబూబ్‌పాషా, నాయకులు కొమిరెల్లి, ఆయూబ్‌పాషా, గంగరాజు, సత్యనారాయణ, అంబరిష, రెడ్డి, కృష్ణ, రవి, సాయి, రంజిత్, మల్లయ్య ఉన్నారు.

దాతల సహకారంతో ఆర్థిక సాయం

గార్ల, ఏప్రిల్ 4 : ఇటీవల కాలంలో మండల కేంద్రానికి చెందిన మాజీ జర్నలిస్ట్ ఎస్‌కే యాకూబ్ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం దాతల సహకారంతో సేకరించిన రూ.57,500లు వారి కుటుంబ సభ్యులకు అఖిల పక్షం నాయకులు అందజేశారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : భర్తను ప్రియుడి ద్వారా హత్య చేయించిన భార్య కేసులో సుపారీ తీసుకుని హత్య చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నాలుగు రోజుల క్రితం భద్రాచలంకు చెందిన తాటి పార్థసారథి మండలంలోని భజన తండా వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి అక్క హేమ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి అనుమానంతో మృతుడి భార్య స్వప్నను విచారించారు. స్వప్నకు వెంకటవిద్యాసాగర్‌తో ఉన్న అక్రమ సంబంధం నేపథ్యంలో తరుచూ జరుగుతున్న ఘర్షణ వల్ల ప్రియుడు విద్యాసాగర్ సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు స్వప్న ఒప్పుకుంది. గురువారం స్వప్నను, ఆమె ప్రియుడు వెంకటవిద్యాసాగర్‌తోపాటు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సుపారీ తీసుకుని హత్య చేసిన కొత్తగూడెం పట్టణంలో నివసించే తెలగారి వినయ్‌కుమార్, బోగ శివశంకర్, మోతుకూరి వంశీలు పరారీలో ఉండగా శుక్రవారం రాజమండ్రిలో పట్టుకుని వారిని అరెస్టు చేశామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని ధ్వంసం చేసిన దుండగులు

చర్యలు తీసుకోవాలని బాధితుడి వేడుకోలు

ధ్వంసమైన పిల్లర్లను చూపుతున్న శంకరయ్య

చిన్నగూడూరు ఏప్రిల్ 4 : మండల కేంద్రంలో ఇంటి నిర్మాణ పనులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన నీలం శంకరయ్య కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండ్ శివారులో వారసత్య భూమిలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టి పిల్లర్స్ వేసినట్లు తెలిపారు. గురువారం రాత్రి కొందరు వ్యక్తులు జేసీబీతో పిల్లర్స్ కూల్చివేశారన్నారు. తన అన్న భూమిని కొనుగోలు చేసే విషయంలో తమ బంధువులు అడ్డుపడి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో కోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిపారు. దీంతో బంధువైన ప్రదీప్‌చంద్ర, అతని అనుచరులు గురువారం రాత్రి తన స్థలంలో నిర్మించుకున్న ఇంటి పిల్లర్లను జేసీబీతో ధ్వంసం చేశారన్నారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేశామని, తనకు న్యాయం చేయాలని కోరారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి మానుకోట బస్సు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఐదు బస్సులను నడుపుతామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సన్న బియ్యం పేదలకు వరం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్య పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కంబాలపల్లి గ్రామంలో సన్నబియ్యంతో వండిన అన్నంను కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపేందర్‌రెడ్డి, స్వర్ణలత, వెంకన్న పాల్గొన్నారు.

కార్గో ద్వారా కల్యాణ తలంబ్రాలు

కేసముద్రం , ఏప్రిల్ 4 : ఆర్టీసీ కార్గో ద్వారా భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు పొందవచ్చని బారాస మండల మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీష్‌నాయక్ సూచించారు. స్వామి వారి కల్యాణానికి సంబంధించిన కర పత్రాలను శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సీతారాముల కల్యాణానికి వెళ్లలేని భక్తులు స్వామి వారి తలంబ్రాల కోసం రూ.151తో బుక్ చేసుకుంటే తలంబ్రాలు ఇంటికే వస్తాయని తెలిపారు. సెల్ ఫోన్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోఎగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ వేలాద్రి, ఓలం వీరభద్రారావు, భూక్యా నరేశ్, వెంకటేశ్వర్లు, శివలాల్, అర్జున్ పాల్గొన్నారు.

ఆకేరువాగులో ఆగని దందా

- ప్రజాప్రతినిధుల అండతో రెచ్చిపోతున్న ఇసుక అక్రమార్కులు?
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

నర్సింహులపేట, ఏప్రిల్ 4 : ఆకేరువాగులోకి ట్రాక్టర్‌దిగితే అంతే... అనుమతి ఇచ్చిన సమయం ముగిసినా సీజ్ చేసుడే.. గ్రామంలో ఏర్పాటు చేసిన డంప్ ఎత్తినా ట్రాక్టర్‌ను పట్టుకునుడే.. ఇలా పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై డేగకన్ను వేశారు. దీనికితోడు జిల్లా పోలీసు అధికారి ఫిబ్రవరి 11న వాగును పరిశీలించి ఇసుక రవాణాపై ప్రత్యేక నజర్ వేయడంతో అక్రమార్కుల గుండెళ్లో రైలు పరుగెత్తాయి. ఒక్కసారిగా అంతా తలకిందులైంది. పోలీసులు, రెవెన్యూ చేతులేత్తేశారు. దీంతో కను మసకైయిందంటే చనిపోయిన జంతువుల కళేబరాలు తినేందుకు వచ్చే గద్దల్లా ఆకేరువాగులో వాలిపోతున్నారు. ఇసకను ఇష్టం వచ్చినట్లు తోడేస్తున్నారు. చేతులు తడుపడంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నగూడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు గూడారం తగుల బెట్టారంటే ఇసుక అక్రమార్కులు ఎంత బరి తెగించారో అర్థం చేసుకోవచ్చు. ఇలానే వదిలేస్తే ఎంతకైనా తెగించేలా ఉన్నారని మండల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులో మోటర్లు, స్టాటర్లు అపహరించుకపోతున్నారని భయందోళన చెందుతున్నారు.

నాయకుల అండతో అక్రమ రవాణా..?

స్టేజీల మీద అక్రమార్కుల భరతం పట్టాలి.. పార్టీలకు అతీతంగా ఎవరు అక్రమ దందాలు చేసినా వదిలేదిలేదు. ఎంతటి వారైనా చర్య తీసుకోవాలని చెబుతున్న నాయకులు ఆచారణలో మాత్రం అమలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జేబులు నింపేందుకు ఈ నెల 10 వరకు వదిలేయండి? ఎవరు అడ్డుకొవద్దు ? ఇసుక, బెల్లం ఏదైనా అపవద్దు అని ప్రజాప్రతినిధులు అధికారులకు చెప్పడంతో అక్రమ రవాణాను అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదనే చర్చ జరుగుతున్నది. అక్రమార్కులు మాత్రం మాకు మా నాయకుడు చెప్పాడు ఈ నెల 10వరకు మా దందాలు ఆపేవారు లేరని బాహాటంగానే చెబుతున్నట్లు తెలిసింది. పెద్దనాగారం ఉమ్మడి జీపీ పరిధిలో బెల్లం వాహనం పట్టుకుని లక్షల్లో చేతులు తడిపారే ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్ల చప్పుళ్లకు రాత్రి 7అయితే ఊళ్లల్లో ఎటువైపు నుంచి ఏ ట్రాక్టరు వస్తుందోనని, బయటకు రావాలంటే భయంగా ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజల్లో నమ్మకం ఉంచుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ రవీందర్‌రావు దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు పెళ్లి రోజు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సంధ్యారాణి దంపతుల పెళ్లిరోజు వేడుకలను శుక్రవారం పట్టణంలోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి రవీందర్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, తేళ్ల శ్రీను, మార్నేని రఘు, ముత్యం వెంకన్న, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పుపై అధికారుల పరిశీలన

కేసముద్రం , ఏప్రిల్ 4 : మండల కేంద్రంలో చేపట్టనున్న రోడ్డు వెడల్పు నిర్మాణ పనులపై మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. వర్షపు నీరు వెళ్లడానికి వీలుగా ఏ ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మించాలి, ఏ ఏ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు మార్చాలి అనే విషయాలపై పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నరేందర్‌రావు, ఈఈ బీమ్లా, ఏఈ ప్రశాంత్‌నాయక్, ట్రాన్స్‌కో ఏఈ కుదురుపాక రాజు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

తొర్రూరు, ఏప్రిల్ 4 : నాంచారి మడూరు గ్రామ చెరువులో అక్రమంగా రాగడి మట్టిని తవ్వి ఇటుక బట్టీలకు తరలిస్తున్న ఘటనపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చెరువులోకి దిగిన జేసీబీ టిప్పర్లను అడ్డుకున్నారు. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ముగ్గురికి జైలు

తొర్రూరు ఏప్రిల్ 4 : గుడుంబా దాడుల్లో పట్టుబడిన పెరుమాండ్ల సతమ్మ (రాజులకొత్తపల్లి), గుంటుక వెంకటయ్య (అమ్మాపురం), జాటోత్ హరిసింగ్(ఎల్‌బీతండా) బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఖమ్మం జైలుకు రిమాండ్ అయ్యారు. రూ.1,35,000 జరిమానా విధించినట్లు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ ప్రవీణ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెద్దులు మృతి

గూడూరు, ఏప్రిల్ 4 : విద్యుదాఘాతనికి గురై కాడెద్దులు మృతి చెందిన ఘటన మండలంలోని పడమటితండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తేజావత్ రాంచంద్రునాయక్ పశువులను మేపుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్తు వైరుకు విద్యుత్ సరఫరా వచ్చి కాడెద్దులు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. రాంచంద్రునాయక్ కూడా విద్యుత్ షాక్ తగలడంతో స్థానిక రైతులు వెంటనే దవాఖానకు తరలించి చికిత్స అందించారు. కాడెడ్ల మృతితో రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని, బాధిత రైతును ఆదుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్‌నాయక్ డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య

బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ విజయవంతం చేయాలి

పెద్ద వంగర ఏప్రిల్ 4 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పెద్దవంగర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల, గ్రామ ముఖ్య నా